# బిల్లు ఉంటేనే హక్కులు చెల్లు

- కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై బిల్లు తీసుకోవాలి
- నాణ్యమైన వస్తువులు పొందలేకపోతే కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించవచ్చు
- వినియోగదారుల హక్కులపై విస్తృత ప్రచారం చేయాలి
- ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలి
- ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వ్యవస్థాపకులు సాయి రమేష్
- భద్రాద్రి కొత్తగూడెంలో ఘనంగా 62వ వరల్డ్ కన్స్యూమర్ డే
- ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ జిల్లా చైర్మెన్‌గా పుడారి శ్యామ్ కుమార్ నియామకం
- శ్యామ్ కుమార్‌ను ఘనంగా సత్కరించిన పలువురి ప్రముఖులు



**కొత్తగూడెం, మార్చి15(కెరటం ప్రతినిధి)**

బిల్లు ఉంటేనే హక్కులు చెల్లుతుందని, కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, మనం కొన్న వస్తువులు నాణ్యమైన వస్తువులు పొందలేకపోతే కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించవచ్చునని, వినియోగదారుల హక్కులపై విస్తృత ప్రచారం చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వ్యవస్థాపకులు సాయి రమేష్ తెలిపారు. 62వ వరల్డ్ కన్స్యూమర్ డేని చాతకొండ నందుగల సాయి రామ్ ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్మెన్‌గా పుడారి శ్యామ్ కుమార్‌ను కన్స్యూమర్ రైట్స్ వ్యవస్థాపకులు సాయి రమేష్, రాష్ట్ర చైర్మెన్ నాగుబండి రమేష్, మల్లెల ఉషారాణి ఎన్నుకోవడం జరిగింది.

ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వినియోగదారుల హక్కుల సంరక్షణ విస్తృతంగా ప్రచారం చెయ్యాలని సూచించారు. వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై వ్యాపారుల దగ్గర నుండి బిల్లులు తీసుకునే విధంగా ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. వినియోగదారులు నాణ్యమైన వస్తువులు పొందలేకపోతే కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించవచ్చునని వాటి ద్వారా న్యాయం పొందే అవకాశాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. తూకాలలో మోసపోవద్దని వస్తువు కొనుగోలులో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాస్థాయిలో, డివిజన్ స్థాయిలో, మండల స్థాయిలోని రైతులందరికీ వినియోగదారుల హక్కులు పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. వినియోగదారులందరూ తాము కొనుగోలు చేసిన వస్తువులకు విధిగా బిల్లులు తీసుకోవాలని, కొనుగోలు చేసిన వస్తువు ఏదైనా చెడిపోతే వినియోగదారుల హక్కు ఫోరంలో ఫిర్యాదు చేసి తమకు జరిగిన నష్టాన్ని తిరిగి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మెన్‌గా ఎన్నుకోబడిన పుడారి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులు నాగుబండి రమేశ్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వినియోగదారులకు ఎటువంటి మోసం జరిగిన తనను నేరుగా సంప్రదించవచ్చునని తెలియజేసారు. వినియోగదారలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, వారికి ఏ కష్టం వచ్చినా ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ తరపున అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వైస్ చైర్మెన్ డాక్టర్ వసంతి, కమిటి మెంబర్స్ నాజియా, లింగేశ్, చంద్రకళ, రూత్, గాజుల రాజు, ఇమాం తదితరులు పాల్గొన్నారు.







## కరుణా గోపాల్‌కు
# 'అద్రాజా - నారీ శక్తి సమ్మాన్' అవార్డు

**హైదరాబాద్, మార్చి15(కెరటం ప్రతినిధి)**

భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకురాలు, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ అధ్యక్షురాలు, కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ బోర్డు డైరెక్టర్ కరుణా గోపాల్ వర్తకవికి అమిటీ గ్లోబల్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మక అవార్డు 'అద్రాజా - నారీ శక్తి సమ్మాన్' అవార్డు శుక్రవారం అందజేశారు. ఈ అవార్డు వివిధ రంగాలలో గణనీయమైన కృషి చేసిన ఆదర్శప్రాయమైన మహిళలకు ఇస్తుంటారు. పట్టణ సంస్కరణలు, ఆవిష్కరణలు, పాలన, పాలసీ రంగాలలో రెండు దశాబ్దాలుగా ప్రశంసనీయమైన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేశారు. సమ్మిళిత నగరాలను రూపొందించడంలో కీలకపాత్ర పోషించారు. అభివృద్ధి, సామాజిక రంగాలలో చేసిన కృషికి ఈ విశిష్ట గుర్తింపును తెచ్చిపెట్టింది. కరుణా గోపాల్ రచనల పట్ల



తమ అభిమానాన్ని వ్యక్తం చేస్తూ అమిటీ గ్లోబల్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన ఆహ్వాన పత్రంలో 'సమాజం పట్ల మీకున్న నిబద్ధత మన దేశానికి అత్యంత గర్వకారణం. ఈ శుభ సందర్భంగా మిమ్మల్ని సత్కరించడం మాకు చాలా గొప్పగా ఉంది' అని రాసుంది. ఈ అవార్డులు కరుణా గోపాల్ తో పాటు లక్ష్మీ సింగ్ (ఐపీఎస్), మాజీ రాజ్యసభ సభ్యుడు రూపా గంగూలీ, కథక్ డ్యాన్సర్ పద్మశ్రీ శోవన నారాయణ్ కు దక్కాయి.

**అమిటీ గురించి..**

భారతదేశంలోని ప్రముఖ గ్లోబల్ ఎడ్యుకేషన్ గ్రూప్ అమిటీ. ఇది రెండు దశాబ్దాల క్రితం స్థాపించబడింది. గ్లోబల్ నాలెడ్జ్ నెట్‌వర్క్‌ను రూపొందించడం ద్వారా గ్లోబల్ బెంచ్‌మార్క్ చేయబడిన విద్యను అందించడం ద్వారా గ్రూప్ నడపబడుతుంది. 1,200 ఎకరాల్లో విస్తరించి ఉన్న క్యాంపస్‌లు, రెన్యూవబుల్ ఎనర్జీ, న్యూక్లియర్ సైన్స్ %�á% నానోటెక్నాలజీ వంటి భవిష్యత్తుపై దృష్టి కేంద్రీకరించే రంగాలతో పాటు మేనేజ్‌మెంట్ నుంచి లా వరకు 60 విభిన్న విభాగాలలో 400 కంటే ఎక్కువ ప్రోగ్రామ్‌లను అభ్యసిస్తున్న 200,000 మంది తెలివైన విద్యార్థులకు నిలయంగా ఉంది.

## శాంటా మారియా విద్యార్థుల దాతృత్వం

**హైదరాబాద్, మార్చి15(కెరటం ప్రతినిధి)**

'విద్యతో జ్ఞానాన్ని పొందవచ్చు. విద్యతో ఉపాధిని పొందవచ్చు. విద్యతో నడవడికను నేర్చుకోవచ్చు. విద్యతో దాతృత్వాన్ని అలవర్చుకోవచ్చు' అని శాంటా మారియా విద్యార్థులు నిరూపించారు. సమాజంలో అత్యంత దయనీయ స్థితిలో ఉన్న వాళ్లకు సహకరించేం దుకు శాంటా మారియా విద్యార్థులు ముందుకు వచ్చారు. అందులో భాగంగా ఐ ఎస్ పీ స్ట్రీట్ చైల్డ్ యునైటెడ్ (ఐ ఎస్ పీ, ఎస్ సీ యూ), 'హీల్ ఏ చైల్డ్' అనే రెండు విజయవంతమైన నిధుల సమీకరణకు విద్యార్థులు నేతృత్వం వహించారు. ఒక్కొక్కటి లక్షకు పైగా విరాళాలు సేకరించాయి. ఇది ఒకటోది.. ఐ ఎస్ పీ, ఎస్ సీ యూ 'స్ట్రీట్ చైల్డ్ యునైటెడ్' సహకారంతో విరాళాలు సేకరించింది. వీధుల్లో నివసించే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించడానికి సిద్ధమైంది. ఈ కార్యక్రమం ద్వారా బలహీన పిల్లల జీవితాలను మార్చడంలో భాగంగా ఎస్ సీ యూకి మద్దతు, వనరులను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది రెండోది..'హీల్ ఏ చైల్డ్' అనేది ఆర్థికంగా వెనుకబడి సరైన వైద్య చికిత్స అందక పోరాడుతున్న పిల్లల క్లిష్టమైన సమస్యపై దృష్టి సారిస్తుంది. శాంటా మారియా విద్యార్థులు వైద్య చికిత్స కోసం నిధులను సేకరించడం, కీలకమైన సామాగ్రిని అందించడం, ప్రాణాలను రక్షించే శస్త్రచికిత్సలు, చికిత్సకు మద్దతు ఇస్తున్నారు. ఈ సందర్భంగా శాంటా మారియా ప్రిన్సిపాల్ శ్రీమతి రుచిరా ఘోష్ మాట్లాడుతూ ఈ దాతృత్వ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్ని ఇస్తుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది సేవా స్ఫూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం

- కేసీఆర్ మనోధైర్యాన్ని ఇంచుక మందం కూడా కదిలించలేరు
- ఎన్నో ఆటుపోట్లను చూసిన ఉక్కుగుండె కేసీఆర్‌ది
- లోకసభ ఎన్నికలకు ముందు రాజకీయ కక్షతోనే అరెస్టు
- బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ



**కొత్తగూడెం, మార్చి15(కెరటం ప్రతినిధి)**

బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమమని, సుప్రీం కోర్టులో కేసు పెండింగులో ఉండగా రేపో ఎల్లుండో ఎన్నికల నోటిఫికేషన్ వస్తున్న నేపథ్యంలో.. ఈడీ సోదాలపేరుతో అరెస్టు చేయడం తెలంగాణ ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నదని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ తీవ్రంగా ఖండించారు. రాజకీయ సీరియల్ తలపించేలా ఇన్నిరోజులు విచారణ పేరుతో అయోమయానికి గురిచేసిన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఈడీ తీరా లోకసభ ఎన్నికలకు ముందు అకారణంగా అరెస్టు చేయడం రాజకీయ కక్షలకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయడమేనని దుయ్యబట్టారు. ఇది చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడమేనన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రగతి పథంలో ముందుకుపోయిన రాష్ట్రాన్ని చెల్లాచెదురు చేసి తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు బీజేపీ జాతీయ నేతలు పన్నిన రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. రాజకీయ కుయుక్తులతో తెలంగాణ సాధకుడు కేసీఆర్ మనోధైర్యాన్ని ఇంచుక మందం కూడా కదిలించ లేరని, ఇటువంటి ఎన్నో ఆటుపోట్లను చూసిన ఉక్కుగుండె కేసీఆర్ ది అన్నారు. ఇటు వంటి చర్యలకు బెదిరేదిలేదనీ, ఎంఎల్సీ కవితకు యావత్ తెలంగాణ సమాజం అండగా నిలుస్తుందని స్పష్టం చేసారు. ఈ వ్యవహారం పై న్యాయస్థానాల్లో పోరాడుతామని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ లావుడ్యా పూర్ణ అన్నారు.

# ప్రభుత్వ ఆదేశాలు లెక్కచేయని ప్రైవేట్ యాజమాన్యాలు

- గవర్నమెంట్ నిబంధనలు తుంగలో తొక్కి రెండు పూటలా పాఠశాలలు నడుపుతున్నారు
- నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు
- టీపీటీఎఫ్ సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు మల్లెల్లి శ్రీనివాస్

**సత్తుపల్లి, మార్చి15(కెరటం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నేటి నుండి అనగా మార్చ్ 15 తారీకు నుండి అన్ని ప్రభుత్వ,గ ప్రైవేట్ పాఠశాలలకు ఒక్క పూట బదులు నిర్వహించవలసి ఉందని, కానీ సత్తుపల్లి పట్టణ పరిధిలో ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కూడా ఈ నిబంధనను పాటించకుండా వారికి ఇష్టం వచ్చిన రీతిలో పాఠశాలలు నిర్వహిస్తున్నారని టీపీటీఎఫ్ సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు మల్లెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలను ఖాతరు చేయకుండా ఇష్టం వచ్చినట్టుగా రెండు పూజలా ప్రయివేటు పాఠశాలలు నిర్వహిస్తున్నారని, వారిపై సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి దృష్టికి విషయం తీసుకెళ్లిన కూడా ఆయన మీనమేషాలు లెక్కిస్తున్నారని, దీన్నిబట్టి చూస్తుంటే ప్రైవేటు యజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు తొత్తులుగా మారారు అని తేట తెల్లమవుతుందని విమర్శించారు. విద్యాశాఖ అధికారులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు, టీచర్ల హక్కులను పరిరక్షిస్తూ రెండు పూటలా బడులు నడిపే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం సత్తుపల్లి డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మల్లెల్లి డిమాండ్ చేశారు. పరిస్థితి ఈ విధంగానే ఉంటే పై అధికారుల దృష్టికి విషయం తీసుకొని వెళ్లడం జరుగుతుందని, అదేవిధంగా సత్తుపల్లి ఎంఈఓ కార్యాలయం ముట్టడించడానికి సంఘ సభ్యులు నిర్ణయించడం జరిగిందని తెలిపారు.








## గూడెం బార్ ఎలక్షన్ అధికారిగా 'గణేష్ బాబు'

**కొత్తగూడెం, మార్చి15(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు జరగాలని బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికల లిస్టు ఖరారు అయినది. కొత్తగూడెం బార్ ఎలక్షన్ ఆఫీసర్‌గా పలివెల గణేష్ బాబును నియమించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, లైబ్రరీ కార్యదర్శి , ఆటల సాంస్కృతిక కార్యదర్శి, మహిళా రిప్రజెంటేటివ్ పదవులకు నామినేషన్లు మార్చి 18 నుండి 21 వరకు దాఖలు చేయవలెనని,మార్చి 22న సాయంత్రం నాలుగు గంటల వరకు ఉపసంహరణ 5 గంటలకు, ఫైనల్ లిస్టు ప్రకటించెదరని మార్చి 28న 10:30 గంటల నుండి మూడు గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని, లెక్కింపు తదుపరి ఫలితాలు తెలియపరుస్తామని ఎన్నికల అధికారి పలివెల గణేష్ బాబు తెలిపారు.





## రాజకీయ లబ్ధి కోసమే కవితక్క అరెస్టు

- బిజెపి పిట్ట బెదిరింపులకు భయపడేది లేదు
- కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ

**కొత్తగూడెం, మార్చి15(కెరటం ప్రతినిధి)**

అటు కేంద్రం, ఇటు రాష్ట్రం రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత అరెస్టు జరిగినటువంటి కుట్ర అని, కవితక్క ఈడి అరెస్టు చేయటం అన్యాయమని, కవితక్కకు తెలంగాణ సమాజం అండగా ఉంటుందని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ తెలిపారు. ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం పట్ల కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందుస్తు ప్రణాళికతోనే ఆమెను అరెస్టు చేయడం జరిగిందని, ఈ అరెస్టు ఎమర్జెన్సీని తలపిస్తోందన్నారు. ఉదయం నుండి ఎంక్వయిరీ అని చెప్పి కోర్టు సమయం దాటిన తర్వాత అరెస్టు చేయడం అప్రజాస్వామీకమని, ఎలక్షన్‌ల ముందు ఇట్లా చేయడం తప్పుడు చర్య ఈ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ కుయుక్తులతో తెలంగాణ సాధకుడు కేసీఆర్ మనోధైర్యాన్ని ఇంచుక మందం కూడా కదిలించలేరని, ఇటువంటి ఎన్నో ఆటుపోట్లను చూసిన ఉక్కుగుండె కేసీఆర్‌ది అన్నారు. ఇటువంటి చర్యలకు బెదిరేది లేదనీ, ఎంఎల్సీ కవితకు యావత్ తెలంగాణ సమాజం అండగా నిలుస్తుందని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ స్పష్టం చేసారు.

## ఘనంగా కాన్షిరం జయంతి వేడుకలు

**తల్లాడ, మార్చి15(కెరటం ప్రతినిధి)**

దళిత నేత కాన్షీరాం 90 వ జయంతి వేడుక తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో బీసీ, ఎస్సీ,ఎస్టీ ప్రజలు డి.ఎస్.పి, జె త్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి ఖమ్మం జిల్లా సినియర్ కోఆర్డినేటర్ వేణు మహారాజ్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలుగన్న రాజ్యాన్ని సాధించి నూటికి నూరు శాతం ఉన్న ప్రజలకు రాజ్యాధికారాన్ని అందించిన మహనీయుడు కాన్షీరాం అని నూటికి నూరు శాతం ఉన్న ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి భూమి, ఇల్లు మౌలిక సదుపాయాలు అందరికీ సమానంగా దక్కాలంటే రాజ్యాధి కారమే అంతిమ లక్ష్యంగా పనిచేయాలని ఆయన కోరారు అనంతరం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడి బసవయ్య మహారాజ్ మాట్లాడుతూ అంబేద్కర్, కాన్షీరాంకు సిసలైన వారసుడు డా.విశారదన్ మహారాజ్‌నని తెలంగాణలో బీసీ. ఎస్సీ. ఎస్టీలకు రాజ్యాధికారం ధర్మ సమాజ్ పార్టీకే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం నాయకులు శివ మహారాజ్, మాబు, మాజీ సర్పంచ్ కృష్ణ, ధర్మ ,వేణు, నవీన్, శ్రీనివాస్, అంజి తదితరులు పాల్గొన్నారు.